క్లుప్తంగా

ఎన్ఎన్ఎమ్ స్కాలర్ షిప్‌కు ముగ్గురు విద్యార్థులు ఎంపిక

నున్న(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పొందడానికి నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు యలమర్తి సెల్వసాగర్, బాణావతు జోసెఫ్‌రాజు, పెద్దింటి యుగవెంకట శివనాగసాయి స్కాలర్‌షిప్ పొందడానికి జరిగిన పోటీ పరీక్షల్లో ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. వీరికి 9, 10, 11, 12 తరగతులు చదువుకునేందుకు ప్రతీ ఏటా కేంద్ర ప్రభుత్వం రూ. 12 వేల ఆర్థిక సాయం అందజేస్తుందని పేర్కొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు, స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. కాగా శనివారం ఉదయం శ్రీవారి సుప్రభాతసేవ, తొమ్మిది గంటలకు స్వామివారికి అభిషేకం చేసి నూతన వస్త్రాలతో స్వామివారిని పెళ్లి కుమారుడిని చేశారు. సాయంత్రం ఆరు గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, విశ్వక్సేన పూజ, దీక్షాధారణ వంటి పలు పూజా కార్యక్రమాలు చేశారు. ఆదివారం కూడా పూజా కార్యక్రమాలు కొనసాగుతాయి.

రక్తపు వాంతులతో వృద్ధుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రక్తపు వాంతులు చేసుకుని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామంలో మేడం అంజయ్య(73) కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయనకు భార్య, ఐదుగురు సంతానం ఉన్నారు. గంపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నాలుగు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గంపల తాలూకా డబ్బులు గుంటూరులో రావాల్సి ఉండగా అక్కడకు వెళ్లి తిరిగి వారధి వద్దకు చేరుకున్నాడు. తన గ్రామానికి వెళ్లేందుకు శనివారం ఉదయం 10 గంటల సమయంలో వారధి సమీపంలోని బస్టాప్ వద్ద ఆటో కోసం ఎదురు చూస్తున్నాడు. ఒక్కసారిగా రక్తపు వాంతులు చేసుకుని కుప్పకూలిపోయాడు. సమీపంలోని వారు 108కు సమాచారం అందించగా వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది వృద్ధుడిని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



గన్నవరం రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం సిద్ధార్థ ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ సకాలంలో రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. అదే సమయంలో రక్తదాతలు సైతం ఎంతో ఆరోగ్యాన్ని పొందుతారని చెప్పారు. డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ఈ శిబిరంలో రక్తదానం చేశారు. రక్తదాతలను అతిథులు అభినందించారు. పాథాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ నవీన్ చంద్ర, డాక్టర్ జాస్మిన్ సుల్తానా, బ్లడ్ బ్యాంక్ టెక్నిషియన్‌లు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న వరి నారుమడులు

- ఖరీఫ్ సాగుకు సన్నాహాలు చేసుకుంటున్న రైతులు
- ముందస్తు నారుమడులు నాట్లకు సిద్ధం



పునాదిపాడులో సిద్ధమవుతున్న వరి నారుమడి

కంకిపాడు: వరి నారుమడులు సిద్ధమవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో ప్రథమ అంకమైన వరి నారుమడులను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం బోర్ల సదుపాయం, కాలువ నీటి సదుపాయం ఉన్న భూముల్లో రైతాంగం నారుమడులు పోసుకున్నారు.

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 42 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు అనువైన భూమి ఉంది. తొలకరి వర్షాలు, ద్రోణి ప్రభావంతో మోస్తరు వర్షాలు పడుతున్నాయి. దీనికి తోడు బోర్లు, కాలువ నీటి సదుపాయం ఉన్న భూముల్లో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. బహిరంగ మార్కెట్‌తో పాటుగా ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసే విత్తనాలను రైతులు సేకరించుకున్నారు. ఎంటీయూ, బీపీటీ, సాధారణ విత్తన రకాలను ఎంచుకుని సాగు పనులకు ఉపక్రమించారు. విత్తనాన్ని 24 గంటల పాటు నీటిలో నానబెట్టి మొలకట్టి ఆ తర్వాత నారుమడుల్లో చల్లుతున్నారు. ఇప్పటికే భూములను దుక్కులు దున్నారు. సాగుకు అవసరమైన మడులను విడగొట్టి నారుమడి సిద్ధం చేసి విత్తనాలను చల్లుతున్నారు. మరికొందరు ముందస్తుగా విత్తులు చల్లుకోవడంతో వరి నారు మొలకెత్తింది. వరి నారును ఎండుతెగులు, పచ్చపురుగు, ఇతరత్రా తెగుళ్ల నుంచి సస్యరక్షణ చర్యలు చేపట్టి సంరక్షించుకుంటున్నారు.

మరో పది రోజుల్లో నాట్లు..

ముందస్తు నారుమడులు నాట్లకు సిద్ధమవుతున్నాయి. దీంతో మరో పది, పదిహేను రోజుల్లో వరి నాట్లు మొదలయ్యే అవకాశం ఉంది. దీంతో ఒక వైపు నారుమడులు పోసుకుంటూ, మరో వైపు నాట్లకు అనువుగా భూమిని దమ్ము చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. దమ్ము పూర్తయిన పొలాల్లో గట్లను సరిచేసి పొలాల్లోకి కూలీలు వెళ్లేందుకు వీలుగా వ్యర్థాలను తొలగిస్తున్నారు. పొలాల్లో నీరు నిలిచే విధంగా నాటిన వరి నారు జీవం పోసుకునేందుకు అనువుగా అవసరమైన సేంద్రీయ ఎరువులతో భూమిని దమ్ము చేసుకుంటున్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ



పెనమలూరు: విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని వణుకూరు గ్రామ సర్పంచి చక్కా విజయ సూచించారు. వణుకూరు మండల పరిషత్ పాఠశాలలో శనివారం ఆమె విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం కింద అభివృద్ధి చేశారన్నారు. అలాగే అన్ని మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు గత ఐదు సంవత్సరాలు కిట్లు ఇచ్చారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు 'స్టూడెంట్ కిట్స్' పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్ఎం తోట వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ 425 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేసినట్లు తెలిపారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఉప సర్పంచ్ దుట్టా శివనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు



హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయిన సాధించవచ్చని స్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులు పైబడి సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు స్రవంతి ట్రస్ట్ తరుపున శనివారం ఆర్థికసాయం అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ. 5 వేలు చొప్పున మొత్తం ఎనిమిది మంది విద్యార్థులకు రూ. 40 వేల ఆర్థిక సాయాన్ని సత్యప్రసాద్ అందించారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో శిక్షణనిచ్చిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ఉప సర్పంచ్ దుట్టా శివనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్, పాఠశాల హెచ్ఎం తోట వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



ఉంగుటూరు: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రుల తర్వాత ఉపాధ్యాయులదేనని హైదరాబాద్ ఐపీఈ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్. సాయికుమార్ అన్నారు. తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో బోధన పద్ధతులపై ఉపాధ్యాయులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా సాయికుమార్ ఉపాధ్యాయులకు ఆవిష్కరణలను పారిశ్రామిక ఉత్పత్తులుగా మార్చుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా ఆవిష్కరణలు, పారిశ్రామిక ఉత్పత్తుల వైపు మళ్లించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అందుకు అనుగుణంగా బోధన పద్ధతులు అమలు చేయాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అంకుర్ సంస్థలకు ఆర్థికంగా ఎంతో ప్రోత్సాహాలు అందిస్తున్నదని తెలిపారు. ప్రొఫెసర్ సాగర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు ఐజీఎంసీ స్టేడియంలో ఈదుల్ అజ్‌హా నమాజు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈదుల్ అజ్‌హా నమాజు నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ జనరల్ సెక్రటరీ మునీర్ అహ్మద్ షేక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నమాజుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను స్టేడియంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా బక్రీద్ సందర్భంగా సామూహిక ఈదుల్ అజ్‌హా నమాజు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఈద్ నమాజు, 7.30 గంటలకు ఈద్ సందేశం ఉంటుందని చెప్పారు. ఈ నమాజులో ముస్లింలందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని ఇహపరలోకాల సాఫల్యం పొందగలరని కోరారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ కోశాధికారి ఎండీ అన్వర్ పాషా, కార్యదర్శి ఎండీ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

ఫ్యాటీ లివర్‌పై నిర్లక్ష్యం తగదు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫ్యాటీ లివర్ వ్యాధి ప్రస్తుతం ఎక్కువ మందిలో కనిపిస్తోందని, దానిని నిర్లక్ష్యం చేస్తే సిరోసిస్ ఆఫ్ లివర్, క్యాన్సర్‌లకు దారితీసే అవకాశం ఉందని సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నూరే పవన్‌కుమార్ అన్నారు. సూర్యారావుపేటలోని మానస ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఫైబ్రోస్కాన్ అనే అధునాతన పరికరం ద్వారా లివర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఆల్కాహాలిక్‌లో ఎక్కువగా కనిపించే ఈ సమస్య నాన్ ఆల్కాహాలిక్‌లో కూడా స్థూలకాయం, సెంట్రల్ ఒబెసిటీ, కంట్రోల్‌లో లేని మధుమేహం, కొన్ని రకాల వైరస్, మందుల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధిని ఫైబ్రోస్కాన్ ద్వారా నిమిషాల వ్యవధిలో గుర్తించవచ్చని చెప్పారు. మందులు, ఆహారపు అలవాట్లు, రోజు వారీ వ్యాయామం, స్థూలకాయులు బరువు తగ్గించుకోవడం వంటి ప్రక్రియల ద్వారా వైద్య చికిత్సలో ఫ్యాటీ లివర్‌ను రివర్స్‌బుల్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్కే అయోధ్య, డాక్టర్ మానస తదితరులు పాల్గొన్నారు.

లేబర్ సెస్ చెల్లించాలంటూ నోటీసులు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిలను వసూలు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. 2007వ సంవత్సరం నుంచి ఇంటి, భవన నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ, సీఆర్‌డీఏ నుంచి ప్లాను తీసుకున్న వారు లేబర్ సెస్ ఒక శాతం డబ్బులు చెల్లించలేదని కార్మికశాఖ శనివారం నోటీసులు జారీ చేసింది. నున్న గ్రామంలో 2007 నుంచి ఇప్పటి వరకు 165 మంది ఇంటి యజమానులు ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చులో లేబర్ సెస్ ఒక శాతం చెల్లించలేదని, నోటీసు తీసుకున్న 30 రోజుల్లోపు చెల్లించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.సురేష్‌రెడ్డి నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు నున్న గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఆ నోటీసులు వచ్చాయి. గ్రామంలో సుమారు రూ. 50లక్షల వరకు లేబర్ సెస్ రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గన్నవరం రూరల్: సమతుల్య ఆహారంతో ఆరోగ్యం కాపాడుకోవాలని మండల వైద్యాధికారి పి.శ్రీహర్ష రోగులకు సూచించారు. సూరంపల్లిలో 104 వాహన వైద్య సేవల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. దీర్ఘకాల రోగాలైన బీపీ, షుగర్ పేషంట్లకు ఆహార నియమాలపై అవగాహన నిర్వహించారు. ఆహారంలో కాయగూరలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. జంక్ ఫుడ్, బయట ఆహారంకు దూరంగా ఉండాలన్నారు. మసాలాలు, కారం, ఉప్పు, నూనె హాని చేస్తాయని వివరించారు. సరిపడా నీరు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలన్నారు. 104 వాహన వైద్య, స్థానిక ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

బ్యాటరీ దుకాణం దగ్ధం చేసేందుకు యత్నం



గన్నవరం: స్థానిక కొత్తపేటలోని ఓ బ్యాటరీ దుకాణాన్ని పెట్రోల్ పోసి దగ్ధం చేసేందుకు ఓ వ్యక్తి విఫలయత్నం చేసిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వీఎస్.పురం కాలనీకి చెందిన జీ హరికుమార్ కొత్తపేటలోని ఊరచెరువు రోడ్డులో భవిత బ్యాటరీ షాపు నడుపుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి షాపునకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. అయితే అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఓ ఆగంతకుడు బ్యాటరీ దుకాణంపైకి ఎక్కి రేకులను పగులకొట్టి వెంట తీసుకువచ్చిన పెట్రోల్‌ను బ్యాటరీలు, ఇన్వర్టర్లపై పోసి నిప్పు అంటించే ప్రయత్నం చేశాడు. రేకులు పగుటకొట్టే శబ్దం విని అక్కడికి చేరుకున్న దుకాణ స్థల యాజమాని గట్టిగా కేకలు వేయడంతో ఆగంతకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై హరికుమార్ స్థానిక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. గతంలో కూడా రెండు సార్లు ఇదే తరహాలో తన బ్యాటరీ దుకాణాన్ని దగ్ధం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపు మెగా నేత్ర వైద్య శిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అమరావతి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం) ఆవరణలో మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ తెలిపారు. దేవదాయ, ధర్మదాయ శాఖ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో అత్యాధునిక యంత్రాల సాయంతో వైద్య పరీక్షలు చేయటం, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. ఆలయ సిబ్బంది, భక్తులు, ఆలయ పరిసర ప్రాంతాల్లోని దుకాణాల యజమానులు, సిబ్బంది అందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎనికేపాడులో భారీ చోరీ

- పచారీ దుకాణం నిర్వహిస్తున్న వృద్ధ దంపతులపై దుండగుల దాడి
- కాళ్లు, చేతులు కట్టేసి 12 తులాల బంగారం, రూ 1.70 లక్షల నగదు దోపిడీ



దాడి గురించి పోలీసులకు వివరిస్తున్న సత్యనారాయణ, గోవిందమ్మ దంపతులు

రామవరప్పాడు : విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు కేవీఆర్ కాలనీ, టయోటా షోరూమ్ ఎదురుగా జాతీయ రహదారిని ఆనుకుని నిర్వహిస్తున్న ఓ పచారీ దుకాణంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు బంగారం, నగదు అపహరించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరూరి సత్యనారాయణ, గోవిందమ్మ దంపతులు గత 20 సంవత్సరాలుగా పచారీ దుకాణం నిర్వహించుకుంటూ జీవిస్తున్నారు. వీరి పిల్లలకు వివాహం కాగా భార్యాభర్తలిద్దరే ఉంటున్నారు. గ్రామంలోని కేవీఆర్ కాలనీలోని ఓ షాపును అద్దెకు తీసుకుని స్టార్ జనరల్ స్టోర్స్ పేరిట పచారీ దుకాణం నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి తమకు సిగరెట్లు కావాలని అడిగారు. సత్యనారాయణ సిగరెట్లు ఇస్తుండగా వెనుకగా వచ్చి టవల్‌ను మెడకు వేసి బెడ్‌రూమ్‌లోకి లాక్కెళ్లి ఫ్రిడ్జ్ వద్ద పడేశారు. ఇదే సమయంలో సత్యనారాయణ భార్య గోవిందమ్మ ఈ హఠాత్తు పరిణామం నుంచి తేరుకోకముందే ఆమెను కూడా నోరు మూసేసి అరిస్తే చంపేస్తామని బెదరించారు. ఇద్దరినీ అక్కడే ఉన్న బెడ్‌షీట్‌తో చేతులు కట్టేశారు. గోవిందమ్మ మెడలో ఉన్న నానుతాడు, చైను, బంగారు వస్తువులు సుమారు 12 కాసులు బలవంతంగా లాక్కున్నారు. బీరువాలో దాచిన రూ 1.70 లక్షల నగదు, దుకాణంలోని గల్లా పెట్టెలో ఉన్న డబ్బును దోచుకున్నారు. చంపేస్తామని బెదిరించడంతో ఈ వృద్ధ దంపతులు ప్రాణ భయంతో మిన్నకుండిపోయారు. తమ పని అయిపోయిన తర్వాత సత్యనారాయణ సెల్‌ఫోన్‌లోని సిమ్ తీసేసి అక్కడే పడేశారు. దుకాణం షట్టర్‌ను మూసి వేసి అక్కడి నుంచి పరారయ్యారు. దుండగులు కాళ్లు, చేతులు కట్టివేయడంతో సుమారు గంట వరకూ పెనుగులాడి కట్లు విడిపించుకున్న తర్వాత షట్టర్ తీసుకుని బయటకు వచ్చి కేకలు వేశారు. సమీపంలోని వారికి విషయం చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు, వృద్ధ దంపతుల మధ్య పెనుగులాట చోటు చేసుకోవడంతో వీరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు, ఎస్ఐ సతీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దొంగలను గుర్తించేందుకు చుట్టు పక్కల సీసీ కెమెరాల ఫుటేజీను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు బెంగళూరుకు చెందిన స్మితా శ్రీపతి కళాబృందం శనివారం నృత్య నీరాజనాలను అర్పించింది. శనివారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం కళావేదికపై స్మితా శ్రీపతి బృందానికి చెందిన పలువురు చిన్నారులు భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం కళాబృందానికి చెందిన చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.